www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 14 మే 2025
5
వైఎస్ఆర్



నేటి నుంచి చాంద్ ఫిరా గుంబద్ దర్గా ఉరుసు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరం రహమతుల్లా వీధిలో వెలసినచారిత్రాత్మకమైన హజరత్ ఖ్వాజా బందా నవాజ్ సాహెబ్ రహమతుల్లా అలైహి వారి చాంద్ ఫిరా గుంబద్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 14 నుంచి 16 తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి అమీరున్నిసా ఒక ప్రకటనలో తెలిపారు. 16న రాత్రి గంధం, దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుంచి ఫకీర్ల మేళ్ల తాళాలతో విన్యాసాలతో దర్గా వద్దకు చేరి గంధాన్ని సమర్పిస్తారని పేర్కొన్నారు. 15న ఉరుసు, 16న తహలీల్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉరుసు, తహలీల్ రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి పోటీ ఉంటుందన్నారు.. ఉరుసు రోజున రాత్రి ముంబై నుంచి ప్రముఖ ఖవ్వల్ ఇమ్రాన్ సాబ్రి, గోవా నుంచి ప్రముఖ ఖవ్వల్ చాంద్ ఆతీష్, తహలీల్ రోజున రాత్రి ప్రముఖ ఖవ్వల్ ముంబై నుంచి ఇమ్రాన్ సాబ్రి, మైసూర్ నుంచి నిజామ్ నవాజ్‌లు పాల్గొంటారని తెలిపారు. భక్తులు, హిందూ ముస్లిం సోదరులు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్త రైస్ కార్డులకు మోక్షం

- ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తులు
- నెలరోజుల పాటు గడువు
- ఆరు అంశాల్లో మార్పులు, చేర్పులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కొన్నేళ్లుగా కొత్త రైస్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబీకులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అర్హులైన వారికి కొత్త కారులు మంజూరు చేయడంతో పాటు పాత కార్డుదారులకు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. కొత్త కార్డుల జారీతో పాటు ఏయేఅంశాల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చునో పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 6న షెడ్యూల్ ప్రకటించారు. దీంతో కొత్త కార్డుల దరఖాస్తుల ప్రక్రియకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఈనెల 7 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హులైన వారంతా ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేయడం ప్రారంభించారు. నెలరోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పుల ప్రక్రియ అమల్లో ఉంటుంది.జిల్లాలో ప్రస్తుతం 5,78,685 రేషన్ కార్డులు ఉన్నాయి.పేద, బడుగు, బలహీన వర్గాల వారికి రేషన్ కార్డుతో ఎంతో అవసరం ఉంటుంది. రేషన్ కార్డ్ కేవలం సబ్సిడీతో అందిస్తున్న సరుకులకే పరిమితం కాకుండా ప్రభుత్వ పథకాలకూ ముడిపడి ఉంది. ప్రధానంగా పేదింట కష్టం వాటిల్లితే రూపాయి ఖర్చు లేకుండా వైద్యసేవలు పొందేందుకు ఆరోగ్యశ్రీతో పాటు పేదింటి విద్యా కుసుమాలు ఉన్నత చదువులు, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ తదితర ఎన్నో సౌకర్యాలు పొందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అర్హులైన వారు కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. వీరే కాకుండా చిరునామాల మార్పు, కొత్త సభ్యుల చేరిక, మృతుల పేర్ల తొలగింపు తదితర వాటి కోసం వందలాది మంది కలెక్టర్, ఆర్‌డిఒలతోపాటు తహశీల్దార్లకు వినతి పత్రాలు అందజేస్తున్నారు. కలెక్టరేటెతో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో కూడా కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చి పడుతున్నాయి.

ఆరు రకాల సేవలు..

రేషన్ కార్డుల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం ఆరు రకాల సేవలను ప్రకటించింది. అర్హులైన వారంతా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేయడంతో పాటు బియ్యం కార్డుల విభజన, కొత్త సభ్యుల చేరిక, చిరునామాల మార్పు, మృతుల పేర్ల తొలగింపు. అనర్హుల వద్ద ఉన్న రేషన్ కార్డుల సరెండర్ వంటి సేవలందించేందుకు వీలుగా షెడ్యూల్స్‌ను విడుదల చేసింది. ఇదే సమయంలో ఐదేళ్లలోపు చిన్నారులు, 80 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇకెవైసి నుంచి మినహాయింపు ఇచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రధానంగా అనాథ ఆశ్రమాల్లో ఉన్న వృద్ధులకు రైనా కార్డులు లేకపోతే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.



సచివాలయంలో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

15 నుంచి వాట్సాప్ ద్వారా దరఖాస్తు

ఈనెల 15 నుంచి వాట్సాప్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని రేషన్ కార్డు ముందుదైన వెంటనే వాట్సప్ ఫోన్ నెంబర్‌కు రేషన్ కార్డ్ పంపుతారు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి అనుగుణంగా ఈ అవకాశాన్ని ఏర్పాటు చేసింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వాళ్లు ఇప్పుడు చేసుకోవాల్సిన అవసరం లేదు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. సుమారు రాష్ట్రంలో సుమారు మూడున్నర లక్షల మంది కొత్త రేషన్ కార్డుల కోసం గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారందరూ ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేయాల్సిన పనిలేదని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. వైసిపి హయాంలో వచ్చిన దరఖాస్తులలో 3.36 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి వీరు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

అర్హులందరికీ రేషన్ కార్డ్ మంజూరు

జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందిస్తాం. సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కొత్తగా కార్డు పొందేందుకు అర్హత ఉన్నవారంతా గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు ఈ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అందిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నవారికి కార్డులు అందజేస్తాం. ఇప్పటివరకు 4,560 కొత్తగా అప్లికేషన్లు వచ్చాయి.

- జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి, కడప జిల్లా

సార్వత్రిక సమ్మె కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని, కోరుతూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు ఎఐటియుసి, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్. నాగసుబ్బారెడ్డి, బి. మనోహర్ మాట్లాడుతూ బ్రిటిష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 3 నల్ల చట్టలతో రైతులను, 4 లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలుపరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని విమర్శించారు. ఇటువంటి కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నాయని చెప్పారు. ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు రెడ్డి, ఎఐటిముసి జిల్లా అధ్యక్షులు జి. వేణుగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి. అన్వేష్, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసి.బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, అధ్యక్షులు సుబ్బరాయుడు, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, పవన్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిర్మూలించాలి

- వేసవి వినోదంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి, బాల బయన్న

ప్రజాశక్తి - కడప అర్బన్

మూఢనమ్మకాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెవివి జిల్లా కార్యదర్శి బాల బయన్న పేర్కొన్నారు. నగరంలోని మున్సిపల్ హైస్కూల్‌లో వేసవి వినోదంలో భాగంగా మంగళవారం మూఢనమ్మకాలపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలబయన్న ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు మ్యాజిక్ - లాజిక్ కార్యక్రమం ద్వారా అనేక మ్యాజిక్కులు చేసి దాని వెనుక ఉన్న లాజిక్ గుట్టు విప్పి చెప్పారు. మూఢనమ్మకాల నిర్మూలనకు మ్యాజిక్ ఒక మంచి అస్త్రం అన్నారు. ఈ మ్యాజిక్‌లనే కొంతమంది కనకట్టువిద్య, మాయలు మహత్యాలు అని ప్రచారం చేస్తూ మాయమాటలు చెప్పి ప్రజల ధన, మాన ప్రాణాలు దోసుకుంటున్నారని పేర్కొన్నారు. అలాంటి వారి ఆట కట్టించాలంటే విద్యార్థులు ఇటువంటి మ్యాజికులు తెలుసుకోవడం అవసరమన్నారు. నేటి సమాజంలో పాలకులు మూఢనమ్మకాలను పెంచి పోషించే విధంగా ఉన్నారని తెలిపారు. శాస్త్రీయ ఆలోచనలను సైన్సును విద్యార్థులు తెలుసుకోవాలని, అప్పుడే ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వం నేర్చుకుంటారని చెప్పారు. మూఢ నమ్మకాల నిర్మూలనకు చట్టాలు ఉన్నా కూడా ఆచరణలో అమలు కావడంలేదన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రతి విద్యార్థికి మ్యాజిక్‌లో మెలకువలు తెలుసుకుని ఉండాలనే ఉద్దేశంతో మ్యాజిక్ - లాజిక్ నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పిల్లలకు అనేక మ్యాజిక్కులు నేర్పించి వారి చేత ప్రదర్శింపజేశారు. కార్యక్రమంలో జెవివి సీనియర్ నాయకులు పి.వెంకటేశ్వర్లు. ఎస్.సునీత వై. అరుణ కృప, పెద్ద ఎత్తున పిల్లలు పాల్గొన్నారు.



మ్యాజిక్ నేర్పిస్తున్న బాల బయన్న

15న విద్యా భవన్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పిలుపు



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యా భవన వద్ద ఈనెల 15న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా పిలుపునిచ్చారు. మంగళవారం యుటిఎఫ్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా మాట్లాడుతూ ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేస్తామన్న ప్రస్తుత ప్రభుత్వ పాలకులు, అధికారులు ఆ విషయం మరిచి ప్రభుత్వ విద్యారంగాన్ని బదిలీల వ్యవస్థను మార్పు పేరుతో విచ్ఛిన్నం చేయటానికి పూనుకోవటం తగదన్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారినా వారి వైఖరిలో మార్పు ఉండదని పేర్కొన్నారు. మూడు నెలలుగా ప్రతి శుక్రవారం విద్యా భవన్‌లో సమావేశాలు నిర్వహించి పాఠశాల వ్యవస్థలో తీసుకు వస్తున్న మార్పులు, అలాగే బదిలీలలో తీసుకువస్తున్న మార్పులు పై చర్చించిన అంశాలు సంఘాలు సూచించిన పలు అంశాల మార్పులను చేయకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు పోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంగళగిరి సమీపంలో ఆత్మకూరు విద్యా భవన్ వద్ద జరిగే నిరసన ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ బి. కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాజ్ అహ్మద్, నాయకులు గోపీనాథ్, శ్రీనివాసులు, మహబూబ్ బాషా, శివ శంకర్ పాల్గొన్నారు.

చెరువులో ఈతకెళ్లి ఐదుగురు

చిన్నారులు మృతి



- మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, బంధువులు
- నాలుగు గ్రామాల్లో విషాదఛాయలు



పిల్లల మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని మల్లెపల్లె చెరువులో మంగళవారం ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి చెందారు. మృతి చెందిన వారిలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని బోధనం గ్రామానికి చెందిన చరణ్(15), పార్దు (12) మల్లెపల్లి గ్రామంలోని నారాయణ ఇంటికి వేసవి సెలవుల సందర్భంగా వచ్చారు. కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని ఉప్పలపాడుకు చెందిన హర్ష(12), బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లేపల్లెకు చెందిన దీక్షిత్ వయస్సు(6), కాశినాయన మండలంలోని నల్లేరు కొట్టాలుకు చెందిన తరుణ్(10) తమ బంధువుల ఇంటికి సెలవులు కావడంతో వచ్చారు. మంగళవారం మధ్యాహ్నం చెరువులో ఈతకు అని వెళ్లి కనిపించకుండా వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు, బ్రహ్మంగారిమఠం ఎస్ఐ శివప్రసాద్, పోలీసులు నాగేష్, రమణ, రాజేష్ సంఘటన స్థలాన్ని చేరుకొని చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి పొద్దుపోయే వరకూ పిల్లల ఆచూకీ లభించలేదు. గజ ఈత గాళ్లు వచ్చి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 10.35 గంటలకు మృతదేహాలను నీటిలో నుండి బయటకు తీశారు. విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్, మైదుకూరు రూరల్ సిఐ శివ శంకర్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

అకాల వర్షం.. అరటికి నష్టం

- ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి చెట్లు
- 475 ఎకరాల్లో పంట ధ్వంసం
- రూ.4.75 కోట్ల నష్టం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అకాల వర్షానికి అరటి పంట నేలకొరిగింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి నియోజకవర్గంలోని పులివెందుల మండలం, వేముల, లింగాల మండలాలలో 475 ఎకరాల్లో పంట నేల పాలు కావడంతో రూ. 475 కోట్ల నష్టం వాటిలింది. అత్యధికంగా పులివెందుల మండలంలోని కొత్తపల్లి, చంద్రగిరి, ఎర్రబల్లి, నల్లపురెడ్డిపల్లి, నల్లగొండ పల్లి తదితర గ్రామాలలో 400 ఎకరాలు, వేముల మండలంలోని మబ్బు చింతలపల్లిలో 50 ఎకరాలు, లింగాల మండలంలోని ఇప్పట్ల గ్రామంలో 25 ఎకరాల్లో పూర్తిగా అరటి దెబ్బతిన్నట్లు ఉద్యానవన అధికారి రాఘవేంద్ర తెలిపారు. వర్షానికి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన తెలిపారు. పంట బాగా వచ్చి చేతికి సమయంలో నేల పాలు కావడంతో రైతన్నకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరమూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోవడం జరుగుతుందని ప్రభుత్వం అధికారులు, ప్రజాపతినిధులు పరిశీలించి నివేదికలు పంపుతున్నారే తప్ప రైతుకు మాత్రం నష్టపరిహారం అందడం లేదు అని వాపోతున్నారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతుల కోరుతున్నారు.



నేలమట్టమైన అరటి చెట్లు

పంటలు పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

పులివెందుల మండలం పరిధిలోని ఎర్రబల్లి, కొత్తపల్లి గ్రామాలలో సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి పంటలను పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువ కుమార్ రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షులు అనిల్ కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారన్నారు. అరటిదెబ్బతిన్న ప్రతి రైతుకు ఎకరాకు రూ. 50 వేలు ఇవ్వాలని డిమండ్ చేశారు. కొత్తపల్లి పంచాయతీలోని రైతు రామాంజనేయులు యాదవ్ మూడో ఎకరాల అరటి తోట పూర్తిగా దెబ్బతినిందని, సుమారు రూ. 3 లక్షల ఖర్చు చేశారని వారన్నారు. రైతులకు పంట చేతికి వచ్చే సమయానికి ఇప్పటికి మూడోసారి నష్టం వాటిలిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని అన్నారు.

సిహెచ్‌ఒల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులుగా నిరవధికంగా సమ్మెలో ఉంటు పోరాడుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలను మానవతా దృష్టితో ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, కోశాధికారి లక్ష్మి దేవి, మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్) అసోసియేషన్ ఎపి ఎంసిఎ ఆధ్వర్యంలో 15 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సిహెచ్‌ఒలు పోరా డుతుని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు 6 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని, జాబ్ చార్ట్ రూపొందించాలని, బకా యిలు లేకుండా వేతనాలు, అద్దె చెల్లించాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతా లలో ప్రజా సమూహాలకు ఆరోగ్య సమస్యలు రాకుండా కాపాడు తున్నారని తెలిపారు. ప్రభుత్వ చట్టాలను అమలు చేయాల్సిన మంత్రి తాము రూపొందించిన చట్టాలను అవహేళన చేస్తూ మీ వల్ల ఉపయోగం లేదు తొలగిస్తే రూ.500 కోట్లు మిగులుతుందని బాధ్యత రాహిత్యంగా అనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. మహిళలన్న విచక్షణ మరిచిపోయి మంత్రి చేసిన వ్యాఖ్యలు దారుణమని తెలిపారు.

బిజెపి తిరంగా యాత్ర హాస్యాస్పదం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పట్ల మోడీ నాయకత్వ పటిమని చెప్పేందుకు తిరంగా యాత్రను మే 13 నుండి 23 వరకు నిర్వహించాలని బిజెపి నిర్ణయించడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరంగా యాత్రకు ముందు బిజెపి నాయకులు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత నెల 22న పహల్గాం పర్యాటక కేంద్రం వద్ద భద్రతా సిబ్బంది ఉండి ఉంటే ఉగ్ర వాదులు అమాయక పర్యాటకులపై దాడి చేసేవారు కాదని చెప్పారు. దాడిలో 26 మంది పర్యాటకులు చనిపోయి వుండేవారు కాదన్నారు. ఉగ్రవాదుల దాడిలో మృతుల భార్యల నుదుటి సిందూరం పోయి ఉండేది కాదన్నారు. ఆపరేషన్ సింధూర్ కూడా అవసరం లేకుండా ఉండేదని చెప్పారు. అఖిల పక్ష సమావేశంలో భద్రతా వైఫల్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఒప్పుకుందని చెప్పారు. భద్రతా వైఫల్యానికి ఉండడంతోనే బిజెపి దేశ ప్రజలకు, పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన 26 మంది కుటుంబ సభ్యులకు, ఆపరేషన్ సిందూరులో చనిపోయిన మురళీనాయక్‌తో సహా మిగతా సైనికుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు ఎవరు, ఎంతమంది, పట్టుకున్నారు అనేది దాడి జరిగి 22రోజులైనా వివరాలు దేశ ప్రజలకు తెలియక పోవడం సిగ్గుచేటన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. పహల్గాం దాడులు, ఆపరేషన్ సిందూరులో అంశాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యేందుకు ప్రధాన కారణం బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 2005లో భారత నావికా దళంలో, 2007లో భారత సైన్యంలో బ్రహ్మోస్ ను చేర్చడం గమనార్హం అన్నారు.

'మహానాడు'కు పటిష్ట భద్రతా చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈ నెల 27, 28, 29 తేదీలలో చింతకొమ్మదిన్నె పిఎస్ పరిధిలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్‌పి ఐ.జి. అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్ఎస్‌జి ఎస్‌పి ఆరిఫ్ హాఫీజ్, డైరెక్టర్ నచికేత్ విశ్వనాధ్, ఎస్‌పిజిహెచ్ భద్రయ్యతో కలిసి జిల్లాలోని పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు విఐపిలు హాజరు కానున్న నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మహానాడు కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. కార్యక్రమం నిర్వహణలో అల్లరి మూకలు ఘర్షణలకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్, కడప డి.ఎస్.పి జి.వెంకటేశ్వర్లు, ఏ.ఆర్ డి.ఎస్.పి కె.శ్రీనివాస రావు, ఎస్.బి ఇన్స్పెక్టర్లు దారెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్.పురుషోత్తం రాజు, సిఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎస్‌జి ఎస్‌పి ఆరిఫ్ హాఫీజ్



ట్రిపుల్ఐటి డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు

కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలకు 110 జిఒను అమలు చేయాలి

ప్రజాశక్తి -వేంపల్లె

ఇడుపులపాయ ట్రిపుల్ఐటిలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న ఉద్యోగులకు 110 జిఒను అమలు చేయాలని కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షులు నజీర్ హుసేన్ కోరారు. మంగళవారం మండలంలోని ఆర్‌జెయుకెటి పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తాను కలిసి కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు 110 జిఒను అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నజీర్ హుసేన్ మాట్లాడుతూ ఆర్‌జెయుకెటి పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో 2018 నుండి పని చేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి జిఒఅమలు చేయక పోవడం వల్ల జీతాలు తక్కువగా వస్తున్నట్లు చెప్పారు. 2018 నుండి ఇప్పటి వరకు కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలకు సర్వీసు కలపాలని కోరారు. అలాగే సర్వీసు బట్టి రావాల్సిన రూ 40 వేలు జీతాలను ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యను పరిష్కరించాలని ఎన్నో సార్లు వినతి పత్రాలు ఇచ్చిన అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకొనేందుకు జూన్ 11,12,13 తేదిల్లో ఆయా ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలు అందరూ కలిసి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమ్మె నోటిసును ఇడుపులపాయ డైరెక్టర్ కు అందజేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

ఉపాధిలో పండ్లతోటల సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కొత్తగా పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద 25 రకాల పండ్ల తోటలు సాగుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు. సన్నా చిన్నకారు రైతులతో పాటు పెద్ద రైతులకు సైతం ప్రోత్సాహం ఇస్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలోని రైతులకు ఉపాధి హామీ చట్టం కింద పండ్ల తోటలు సాగుకు ప్రోత్సహించి సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కడప జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే 25 రకాల పండ్ల తోటలో సాగుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు.

రైతుల అవసరాల మేరకు నీటిని విడుదల చేస్తాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రైతుల అవసరాల మేరకు పైడిపాలెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తామని గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ఇఇ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పైడిపాలెం ప్రాజెక్ట్ నుంచి ఈ ఏడాది రైతుల అవసరాల మేరకు రెండు టిఎంసిల నీటిని తొండూరు కాలువకు, హిమకుంట్ల కెనాల్‌కు విడుదల చేశామన్నారు. ప్రస్తుతం తొండూరు కాలువకు 160 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు సామర్థ్యం ఆరు టిఎంఎసిలు కాగా ప్రస్తుతం 4.7 టిఎంసిల నీరు నిలువ ఉందన్నారు. రైతుల అవసరాల మేరకు వీటిని విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బాలికల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నల్లపురెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం సిడిపిఒ శ్రీలత ఆధ్వర్యంలో బాలికలకు వారి హక్కులు, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా పిల్లలకు ఉన్న నాలుగు హక్కుల గురించి తెలియజేశారు. జీవించే హక్కు సంరక్షణ హక్కు, వారికి కావలసినవి నిర్ణయాలు తీసుకునే హక్కు, భావోద్వేగ, మానసిక, శారీరక వికాసం చెందే హక్కుల గురించి కిశోర బాలికలకు వివరంగా చెప్పారు,. అక్రమ రవాణా, చైల్డ్ లేబర్, బానిసత్వం, వెట్టి చాకిరి, మొదలగు విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో బాలవికాస్ సూపర్‌వైజర్ కిషోర్, సూపర్‌వైజర్ మాబున్ని , అంగన్వాడీ కార్యకర్తలు విజయభారతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ సావిత్రమ్మ

చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించండి

ప్రజాశక్తి - చాపాడు

చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని చాపాడు ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ పేర్కొన్నారు. మండలంలోని శ్రీరాములపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత ఉత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రానికి వచ్చే చిన్నారులను తమ అంగన్‌వాడీ కార్యకర్తలు కంటికి రెప్పలా చూసుకోవడంతోపాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని తెలిపారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపాలని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఎల్‌కెజి, యూకేజీ తరగతుల కన్నా మెరుగ్గా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను చూసుకుంటారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్ రెడ్డి, ఐటిసి జిల్లా కో– ఆర్డినేటర్ స్వరూపారాణి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'అంగన్వాడీ' సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ఖాజీపేట

అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు జహరా బి ప్రథమ్ జిల్లా కో– ఆర్డినేటర్ నరసింహులు, అంగన్వాడీ కార్యకర్త జె. గంగావతి అన్నారు. మంగళవారం దుంపలగట్టు అంగన్వాడీ కేంద్ర పరిధిలో అంగన్వాడీ సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న సేవలు, అభివృద్ధి, పోషకాహారం, ఆరోగ్య సహాయం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారుల కోసం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను సత్కరించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది రుక్మిణి, పార్వతీ, నాగమణి, రాణి, సరోజ, పార్వతి పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపుల కోసం ఎదురుచూపు

- ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు
- పట్టీపట్టనట్లుగా అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ స్పెషల్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ప్రజలు ఆధార్ కేంద్రాల వద్దకు వెళ్లి ప్రదక్షిణలు చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేంపల్లెలోని ఒక గ్రామ సచివాలయంలోనూ ఆధార్ సెంటర్లు పెట్టక లేదు. అధికారులు మాత్రం ఏమీ ఎరగనట్లు మౌనం వహిస్తున్నారు. ఆధార్ క్యాంపులు పెట్టి చిన్న పిల్లలకు పేర్లు నమోదు చేసుకొనేందుకు, ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరి చేసేందుకు అవకాశం ఉండడంతో ఆధార్ సేవలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈనెల 5 నుండి విడతల వారిగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఎక్కువగా పెట్టి ఆధార్ కార్డు సమస్యలకు పరిష్కారం చూపుతామని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ కార్డు స్పెషల్ క్యాపులను అధికారులు ఏర్పాటు చేయక పోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కత్తలూరులోని సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రం కూడ పని చేయక పోవడంతో వేంపల్లె గ్రామానికి చెందిన ప్రజలు పనులు మానుకుని రోజూ కత్తలూరుకు వెళ్లినా అక్కడ ఆధార్ సేవలు లభించడం లేదు. స్పెషల్ క్యాంపులను ఏర్పాటు చేస్తారని పత్రికల్లో వచ్చినప్పటికీ ఇంతవరకు మండలంలో ఒక్క చోట కూడా ఆధార్ స్పెషల్ క్యాంపలను ఏర్పాటు చేయలేదు. దీంతో ఎప్పుడు ఆధార్ స్పెషల్ క్యాపులను ఏర్పాటు చేస్తారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఆధార్ కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాల్లోనూ ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.



సచివాలయంలో పనిచేయని ఆధార్ కేంద్రం

523 జిఒను సవరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిఒ నెంబర్ 523 సవరించి ఖాళీగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగోన్నతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ వార్డు సచివాలయ సంఘరాష్ట్ర ఉపాధ్యక్షులు మస్తాన్ మాట్లాడారు. 2019లో తీసుకొచ్చిన జిఒను అమలు చేస్తే వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు ఎలాంటి ఉపయోగం లేకపోగా జీవితాంతం వార్డు సచివాలయాల్లో కార్యదర్శి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్ల నుంచి వారికి పన్నుల వ్యవహారాల్లో అపారమైన అనుభవం ఉంది కాబట్టి వారిని సబ్–రిజిస్టర్ కార్యాలయాల్లో ఇన్కమ్ టాక్స్ శాఖలో ఉపయోగించుకోవచ్చు అని అన్నారు. చేనేత శాఖలో ఖాళీలు భర్తీ చేస్తే సముచితంగా ఉంటుందన్నారు. అనుభవం ఉన్న వారి సేవలను ఆయా శాఖలో ఉపయోగిస్తే ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం లభిస్తుందని అన్నారు. జిఒను అమలు చేస్తే వార్డు కార్యదర్శులకు గ్రేడ్ మారుతుంది తప్ప ఎలాంటి ఉపయోగం ఉండదని అన్నారు వార్డులో పనిచేస్తున్న వార్డు సదుపాయాల కార్యదర్శులకు ఇటీవల జూనియర్ టెక్నికల్ ఇంజినీర్ పదవి ఇస్తామని చెప్పి చివరకు ఆ జిఒ ద్వారా కేవలం గ్రేడ్ మార్చడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. గృహ నిర్మాణ శాఖలో కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న వారికి ఎఇలుగా అవకాశం ఇవ్వడం అభినందించవలసిన విషయమే అన్నారు. అదే క్రమంలో లక్షలాదిమందితో పోటీపడి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లుగా ఉద్యోగం సాధించిన వీరికి కేవలం గ్రేడ్ మాత్రమే మార్చి ఉద్యోగన్నతి కల్పించకపోవడం బాధాకరమన్నారు ఉద్యోగోన్నతుల విషయంలో సమన్యాయ సూత్రం పాటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పై సమస్యలను సచివాలయ శాఖ మంత్రివర్యులు దృష్టి సారించి ఉద్యోగులకు ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

- డిపిఎం ఎస్.వి.ప్రవీణ్‌కుమార్



పంటలు పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ రైతులకు సూచించారు. అరవేటిపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సహజ సిద్ధ పద్ధతులను అనుసరించి ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి సార వంతం కోల్పోతుందని చెప్పారు. బడుగువారిపల్లెలో నేరేడు పంట, పండ్ల మొక్కలు పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం వసంత కుమారి, మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి, డివిజనల్ మోడల్ మేకర్ నుజహాత్, యూనిట్ ఇంచార్జ్ రామసుధ,ప్రకృతి వ్యవసాయ అభ్యుదయ రైతు రామలింగేశ్వర నాయుడు,యంగ్ ప్రొఫెషనల్ భరత్ పాటిల్,ఎపియం అపర్ణ దేవి, యూనిట్ ఇంచార్జ్ ముని భూపాల్, ఐసిఆర్‌పిలు, రైతులుఉ పాల్గొన్నారు. **వేముల :** కొత్తపల్లి, వేముల గ్రామాలలో మంగళవాంర డ్వాక్రా మహిళా రైతులు ,ప్రకృతి వ్యవసాయ రైతుతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ పంట కాలం ప్రణాళిక అవగాహన, ర్యాలీ ు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ పిఎండిఎస్ విధానంలో భూమిని సహజ సిద్ధంగా సారవంతం చేయవచ్చని చెప్పారు. జీవన ఎరువులు వాడటం ద్వారా రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గి రైతులకు పెట్టుబడి తగ్గుతుందని సూచించారు. పాడి పశువులు, పంటలను అనుసంధానం చేయడం ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానాలను విస్తృతంగా అమలు చేయడం, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలను ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రుణాలు అనుసంధానం చేయడానికి అవకాశం ఉందని సూచించారు.డ్వాక్రా మహిళలు ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంచడం ద్వారా పౌష్టిక ఆహారం, పురుగు మందులు వాడని కూరగాయలు లభిస్తాయి అన్నారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జులు వెంకటేష్, అంజన్ రెడ్డి, రామ మోహన్ నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయ విధానాలను అమలు చేయడానికి ఐసిఆర్‌పిలు డ్వాక్రా సంఘాలతో కలిసి పని చేస్తారని చెప్పారు. పంటలను ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తూ విశేష కృషి చేస్తున్న ఛాంపియన్ రైతులు మల్లారెడ్డి గోపాల్ రెడ్డి, చందా రమణారెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, రమణారెడ్డి తదితరులను శాలువాలతో, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎపిఎంల చేతుల మీదుగా డ్వాక్రా మహిళలకు 10 రకాల కూరగాయలు విత్తనాలు పాకెట్లు, కిచెన్ గార్డెన్ కిట్స్ ఉచితంగా పంపిణి చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో – ఆర్డినేటర్‌లు జ్యోతి, నాగేశ్వరి గ్రామ సమాఖ్య అసిస్టెంట్‌లు పవన్ కుమార్, భవాని, కుమారి, లత గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు అశ్విని కార్యదర్శి ప్రవల్లిక, కోశాధికారి తులసమ్మ, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ డిఇఒ మీనాక్షి పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాలు కోరాయి. స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ఉన్న డిప్యూటీ డిఇఒ కార్యాలయానికి మంగళవారం తాళం వేసి ఉండడాన్ని వారు గమనించారు. ఈ సందర్భంగా పిఎస్‌వైఎఫ్ ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు స్థానిక విలేకరులతో మాట్లాడారు. డిప్యూటీ డిఇఒ విధులకు సరిగా హాజరు కావడం లేదన్నారు. కంప్యూటర్లను, రికార్డులను తన సొంత వస్తువులుగా భావించి తాళాలు వేసుకోవడం తగదన్నారు. కార్యాలయం పరిధిలో 16 మండలాల ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. డిప్యూటీ డిఇఒ తన వృత్తి ధర్మానికి న్యాయం చేయకపోగా పనిచేసే అటెండర్లను వాచ్‌మెలను బండ బూతులు తిట్టడం ఎంతవరకు సబబు అన్నారు. రోజువారి విధి నిర్వహణలో రికార్డులను కూడా మెయింటైన్ చేయాలని, ఉద్యోగం చేసే ప్రాంతంలోనే సంసారం ఉండాలనే ప్రభుత్వ నిబంధనలు కూడా ఈమె ఉల్లంఘించారని చెప్పారు. ప్రొద్దుటూరు నుంచి విధులు నిర్వహిస్తూ కడపలో నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అలసత్వంతో వ్యవ హరిస్తున్న డిప్యూటీ డిఇఒపై తగిన చర్యలు తీసుకోవాలలని డిమాండ్ చేశారు. ఆమె స్థానంలో మరొకరిని నియమించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు బయన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపిన డ్రైవర్‌కు శిక్ష

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌కు రూ. 2వేల నగదు జరిమానా, పది రోజులపాటు జైలు శిక్ష విధించారు. మైదుకూరు రూరల్ ఎస్ఐ సుబ్బారావు అందించిన వివరాల ప్రకారం.. దువ్వూరు ు చెందిన పెద్దముడియం మహమ్మద్ బషీర్ అహ్మద్ మద్యం సేవించి బొలెరో వాహనాన్ని నడుపుతుండగా తనిఖీల్లో గుర్తించామన్నారు. అతనిపై మోటార్ వెహికల్ యాక్ట్ కేసు నమోదు చేశామన్నారు. ముద్దాయికి మంగళవారం మైదుకూరు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రూ. 2వేలు జరిమానా, పది రోజులు జైలు శిక్ష విధించారు. మద్యం సేవించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి శిక్షపడేలా చేసిన రూరల్ ఎస్ఐ సుబ్బారావును మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్, పోలీస్ సిబ్బంది అభినందించారు.

నిరాశ్రయులకు అన్న దానం

ప్రజాశక్తి-ఖాజీపేట

మండల పరిధిలోని బి. బక్కాయపల్లెకు చెందిన, ఆర్ఇఎస్ జూనియర్ కళాశాల ఉద్యోగి కీ.శే.మూలపాకు బాలగంగి ఒడ్డి వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు నిరాశ్రయులకు మంగళవారం అన్నదానం చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నిరాశ్రయులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మురళీధర్ రెడ్డి, డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి, నేస్తం సేవా సమితి సభ్యులు బాలనాగిరెడ్డి, ఆర్ బి వెంకటరెడ్డి, మునిరెడ్డి లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

కెకె కొట్టాలు గ్రామ సమస్యలను పరిష్కరించాలి : ఎంపీ

ప్రజాశక్తి - వేముల

మండలంలోని స్థానిక కెకె.కొట్టాలు గ్రామస్తులు సమస్యల పరిష్కరించాలని కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప పార్లమెంట్ సభ్యులు ఆధ్వర్యంలో జి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు కెకె కొట్టాల గ్రామం సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామస్తులు, ఎంపీ కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తూ.. టెయిలింగ్ పాండ్ వల్ల నష్టపోయిన కెకెకొట్టాల గ్రామాన్ని యుసిఐఎల్ యాజమాన్యం తీసుకొని పునరావాసం, పర్మెంట్ ఉద్యోగాల అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. పైగా నష్టపరిహారం అర్ అండ్ ప్యాకేజీ ఇవ్వాలని చెప్పారు. అప్పటి వరకు టెయిలింగ్ పాండ్ నిర్మాణ పనులు పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అందుకు కలెక్టర్ సానుకులంగా స్పందిస్తూ వీలైన అంత త్వరలో గ్రామాన్ని సందర్శించి టెయిలింగ్ పాండ్‌ను పరిశీలించి ప్రజలకు న్యాయం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో లావనూరు అంకిరెడ్డి, కెకె కొట్టాల గ్రామ సర్పంచ్ పి. రంగనాతం, సింగంశెట్టి మోహనబాబు, సింగంశెట్టి శ్రీనివాసులు, ఆకుల రాజశేఖర్, పాలెం గంగాధర్ పాల్గొన్నారు.



కడప కలెక్టరేట్‌లో కడప ఎంపీతో కెకెకొట్టాల గ్రామస్తులు



మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - గోపవరం

అర్హులైన పేదలకే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి. జకరయ్య, ఉపాధ్యక్షులు మత్యాలజార్జ్ పేర్కొన్నారు. మంగళవారం బద్వేల్‌లోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో దలళితులు వెయ్యి మందికి పైగా ఇళ్ల స్థలాలు లేని వారు ఉన్నారని చెప్పారు. నిజమైన పేదలకు డోర్ టు డోర్ సర్వే చేసి ప్రభుత్వమే వారికి ఇల్లు కట్టించి ఇవ్వాలని లేనిపక్షంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఇళ్లస్థలాలు పంచి పెడతామని వారు హెచ్చరించారు. దళితులు ఇళ్ల స్థలాలు లేక బాడుగ ఇళ్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. చేసిన ఉపాధి పనులు బిల్లులు రాక కూలీలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నా ప్రజలకు మాయ మాటలు చెప్పి కాలం గడుపుతుందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి రుణాల కోసం దరఖాస్తు కోసం గడువును ఈ నెలాఖరు వరకు పెంచాలని తెలిఆపరు. పేదలను గుర్తించి రుణాలు ఇచ్చే బ్యాంకర్లకు సహాయం చేయమని వారికి చెప్పాలని వారు తెలిపారు. కార్యక్రమంలో బద్వేల్ పట్టణ కార్యదర్శి రాయప్ప, నరసయ్య పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మొక్కల పెంపకం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని ఎన్ఎస్ఎస్ కో– ఆర్డినేటర్ డాక్టర్ లావణ్య. పేర్కొన్నారు. మంగళవారం వన మహోత్సవంలో భాగంగా తాడిగొట్ల గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులతో మొక్కలు నాటించారు. మొక్కల పెంపకం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని, సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయ అభివృద్ధిలో రైతులకు మేలు కలుగుతుందని తెలియజేశారు. అనంతరం తాడిగొట్ల గ్రామంలో రోడ్లకు ఇరువైపులా కానుగా 20, నేరేడు 20, గుల్మొహర్2 0, ఎర్రచందనం 20, ఫెల్టోస్ రైన్ ట్రీ 20 వేప 20, మొక్కలను నాటారు. కార్యక్రమంలో కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ పాండురంగ అభ్యుదయ రైతు చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి నాయకులు ఓబుల్ రెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుత్ను డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

పోలీసుస్టేషన్ల పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి - గోపవరం

బద్వేలు పోలీస్ స్టేషన్ ఆవరణంలోని బద్వేలు రూరల్ కార్యాలయంలో మంగళవారం మైదుకూరు సబ్ డివిజనల్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్ పోలీస్ స్టేషన్ల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్, బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్, అట్లూరు, బి.కోడూరు ,పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన పోలీస్ స్టేషన్ అధికారులకు, క్రైమ్ సమావేశం నిర్వహించామని చెప్పారు. ముఖ్యంగా ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై అధికారులు సమగ్రంగా చర్చించారు. పెరుగుతున్న దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై, పోలీస్ స్టేషన్‌ల పనితీరుపై సమీక్ష, ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చేందుకు కమ్యూనిటీ పోలీసింగ్ పెంపుదల గురించి, అధికారులు, సిబ్బంది నేర నిరోధానికి చురుకుగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

మున్సిపల్ సిబ్బందికి సహకరించండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలో ఉండే వీధి వ్యాపారులను గుర్తించి సర్వే నిర్వహిస్తామని ఇందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి వీధి వ్యాపారుల కమిటీ ఏర్పాటు చేశారు. సమావేశంలో వీధి వ్యాపారులను సర్వే చేసి యాప్‌లో నమోదు చేయడానికి ఈనెల 14 నుంచి 18 వరకు సర్వే నిర్వహిస్తామన్నారు. పట్టణ పరిధిలోని వీధి వ్యాపారులు సర్వే కోస వచ్చే సిబందికి సహరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అజయ్ కుమార్, సి,ఎం.ఎం హరి, సిఒలు రామాం జనేయులు, నాగలక్ష్మి, వెల్ఫేర్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం : కాంగ్రెస్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని జమ్మలమడుగు నియోజగవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సింగం శివ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నుంచి భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పొడుతుందన్నారు. రకరకాల పేర్లతో కరెంటు బిల్లుల్లో ఫీజులను వసూలు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత వెంటనే విద్యుత్ ఛార్జీలను పెంచడం ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలను చూస్తేనే ప్రజలకు షాక్ కొట్టుతుందని చెప్పారు. రకరకాల పేర్లతో వేస్తున్న విద్యుత్తు ఛార్జీలను తగ్గించి ప్రజలకు ఆర్థిక భారం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న శివమోహన్‌రెడ్డి